యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - దత్తిరాజేరు: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోది పిలుపుమేరకు టి.బూర్జవలస గ్రామంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. బీజేపీ గజపతినగరం అసెంబ్లీ కన్వీనర్ సరిది దుర్గా ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో యోగా అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తొచ్చేలాగా "యోగాంధ్ర 2025"ని విజయవంతం చేయాలని గ్రామ ప్రజానీకానికి, విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెజవాడ ఈశ్వరరావు, బూర్లే రాంబాబు, ఇనుముల సురేష్, రాంబాబు, తదితర కూటమి నాయకులు, అధ్యాపకులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ విభజనకు ముందడుగు..

- 15 నెలల్లో ముగియనున్న పాలక వర్గం
- రెండు జిల్లాలకు మండలాలను కేటాయింపుపై దృష్టి
- పిఆర్ శాఖ నుంచి కమిషనర్‌కు లేఖ ..!

విశాలాంధ్ర - విజయనగరం: ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి ప్రస్తుతం ఉన్న జిల్లా పరిషత్ విభజనకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో జెడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అంటే మరో 15 నెలల్లో జెడ్పీ పాలక వర్గం పూర్తి కానుంది. అంతకు ముందే వ్యవస్థీకరణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. ఉమ్మడి జిల్లాలో విజయనగరం, పార్వతీపురం మణ్యం జిల్లాలు ఉన్నాయి. గతంలోనే రెండు జిల్లాలను వేరుచేసి మండలాలను సైతం కేటాయింపులు చేసారు. ప్రస్తుతం జిల్లా పరిషత్‌ను విడదీస్తే మండలాలను ఆయా జిల్లాలకు కేటాయించాల్సి ఉంది. ఈమేరకు పంచాయతీ రాజ్ డైరక్టర్ విభజనకు సంబంధించి ఇప్పటికే ఆ శాఖ కమిషనర్‌కు లేఖ రాసినట్లుగా తెలిసింది. దీంతో జిల్లా పరిషత్ విభజనకు ముందడుగు పడినట్లుగా చెప్పవచ్చు.

జెడ్పీ కార్యాలయాల ఏర్పాటుపై త్వరలోనే దృష్టి..!

ప్రస్తుతం ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్‌కు సంభందించి విజయ నగరంలో జెడ్పీ కార్యాలయం ఉంది. ఇక్కడ నుంచే విజయనగరం, పార్వతీపురం మణ్యం జిల్లాలను ఉమ్మడిగా పరిపాలన చేస్తున్నారు. మణ్యం జిల్లాలోని అన్ని మండలాల జెడ్పీటీసీలు, మండలాల అధికారులు ప్రతీ సమావేశానికి విజయనగరం రావాల్సి వస్తోంది. ప్రస్తుతం విజయనగరంలోని జెడ్పీ కార్యాలయం విజయనగరం జిల్లాకు సరిపోయినా, పార్వతీపురం మణ్యంకు మాత్రం కొత్తగా భవనం ఏర్పాటు చేయాల్సి వుంది. అలాగే పార్వతీపురం మణ్యం జిల్లాకు అతిథిగృహం, క్వార్టర్సును ఏర్పాటు చేయాల్సి ఉంది.

ఉద్యోగుల కేటాయింపు జరగాలి..

జిల్లా పరిషత్ విభజన అనంతరం ప్రధానంగా జరగాల్సింది ఉద్యోగుల కేటాయింపు. జిల్లా పరిషత్‌తోపాటు మండలాలను కేటాయించడం జరిగితే ఉద్యోగులను కూడా ఆయా మండలాలకు బదిలీలను చేయాల్సి ఉంది. ఇప్పటి నుంచే విభజన పనులు ప్రారంభిస్తే పాలక వర్గం పూర్తియ్యే సమయానికి ఒక కొలిక్కి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. విభజన ప్రక్రియ పూర్తి చేయాలని ఇతర జిల్లాలనుంచి ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా కలిసిన మండలాల నేతలు, ప్రజలు కోరుకుంటున్నారు.

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో 16 కంపెనీలతో శుక్రవారం లెర్నింగ్ ట్రీ ఆర్గనైజేషన్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించబడింది. దీనికి 492 అభ్యర్థులు హాజరు అయ్యారు. ఇందులో అభ్యర్థులకు రిటన్ టెస్ట్, టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూ నిర్వహించి 197 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ ఎంపిక ప్రక్రియను వివిధ కంపెనీల హెచ్ ఆర్ లు వచ్చి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని దానికి వారు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు. సత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి మాట్లాడుతూ విద్యార్థులకు మరిన్ని అవకాశాలను కల్పిస్తామని విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకొని సిద్దంగా వుండాలని తెలియజేసారు. ఈ డ్రైవ్ కళాశాల ట్రైనింగ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం.ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం సత్య వేణి, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు పాల్గొన్నారు.

సీపీఐ 14వ మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - రామభద్రపురం: వచ్చేనెల 26, 27 తేదీల్లో జరగనున్న 14వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. సిపిఐ పార్టీ వందేళ్ళ పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ మహాసభలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే బొబ్బిలి నియోజకవర్గంలో కూడా జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలో ఉన్న మేధావులు కార్మికులు కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల ప్రజల జీవన స్థితిగతులపై చర్చించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కార్యదర్శి కోట అప్పన్న పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహశీల్దార్ సత్యాన్నారాయణ అధ్యక్షతన రెవెన్యూ డే కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ సత్యన్నారాయణ మాట్లాడుతూ రెవెన్యూ సేవలో రైతులకు కావలసిన భూ రికార్డ్‌ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.రాంబాబు, ఎంఈఓ జె.త్రినాధరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘనసత్కారం

విశాలాంధ్ర - గరివిడి: మండలంలోని తాటిగుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులుగా, ఇంగ్లీష్ అసిస్టెంట్ పనిచేసి బదిలీపై గరివిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఎ.సత్య శ్రీనివాసుని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు యడ్ల అప్పారావు, శనపతి సన్యాసి, గంటేడ పైడినాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మెన్ సన్యాసిరావుల సమక్షంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఆయనతో పాటు బదిలీపై తోండ్రంగి ఉన్నత పాఠశాల వెళ్ళిన బయాలజీ ఉపాధ్యాయులు ఎం.శంకరరావుని, పి.డి.ఎం.శ్రీకాంత్‌ని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అలాగే ఈ పాఠశాల కొత్తగా వచ్చిన ప్రధానోపాధ్యాయులు టి.రామకృష్ణ, ఎల్.రామకృష్ణ, ఎ.రవిశంకర్, కె.రమాదేవి, పి.డి.కూర్మి నాయుడుకు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

రాయితీపై వరి విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వావిలపాడు రైతు భరోసా కేంద్రంలో రాయితీపై రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేసినట్టు టీడీపీ నాయకులు గుంటపల్లి దేముడు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రంలో స్వర్ణ, సాంబమసూరి, 1121 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ గోపాలకృష్ణ తెలిపారు. వరి విత్తనాలు కావలసిన రైతులు తమ ఆధార్ కార్డు, పాసుబుక్ లేదా వన్ బితో రైతు భరోసా కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీల రాజేశ్వరి, నీటి సంఘం ఉపాధ్యక్షుడు నవుడు దేవుడు బాబు, గ్రామ పెద్దలు సబ్బవరపు అప్పలనాయుడు, బీల సతీష్, గండి వెంకటరావు, చీపురుపల్లి వెంకు నాయుడు, చల్ల రామ్మూర్తి, బూడి వెంకట్రావు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్పీఎం ఖాతాలను స్థిరీకరించుకోవాలి

విశాలాంధ్ర - గంట్యాడ: మండలంలో గల రీ సర్వే జరుగుతున్న గ్రామాలలో రైతులు తక్షణమే స్పందించి ఎల్పీఎం ఖాతాలను తమ తమ హక్కులు ప్రకారంగా మార్పు చేసుకొనుటకు అవకాశం ఉందని పై అవకాశమును జాయింట్ ఖాతాలో ఉన్న రైతులు తమ పేరు మీదగా స్థిరీకరించుకోవాలని తహసీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి సూచించారు. పై విధంగా చేసుకుంటే హక్కు కలిగిన రైతులకు వన్ బీలు తమ పేరు మీద ధ్రువీకరించుటకు అవకాశం ఉందని అన్నారు. వన్ బీలు రైతులు పేరుమీద ఉంటేనే సంక్షేమ పథకాలకి అర్హులవుతారు అన్నారు. తక్షణమే రైతులు స్పందించి ఈ అవకాశాన్ని ఈ నెలాఖరులోగా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డిప్యూటీ తహశీల్దార్ కే.నాగలక్ష్మి పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఎస్.కోట వాసవి క్లబ్ మెగా ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి సౌజన్యంతో పుస్తకాలు పంపిణీ నిర్వహించారు. ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి హెచ్.నానాజీ మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సమాజంలోని వివిధ వర్గాల వారికి సేవలను అందిస్తున్నట్లు ఈ సేవా కార్యక్రమాలలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు పుస్తక పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ మెగా అధ్యక్షులు పచ్చి కోళ్ల అప్పారావు, వాసవి క్లబ్ యూత్ అధ్యక్షులు ఉప్పల విజయకుమార్, పూర్వ ప్రాంతీయ అధికారి బాలనాగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్.సాయి, సీనియర్ వాసవి క్లబ్ సభ్యులు బొండా వెంకటరమణమూర్తి, కొనగల్ల శీను పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు

విశాలాంధ్ర - బాడంగి: స్థానిక బాడంగి జడ్పీ పాఠశాలలో మండలంలో గల దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు మండల విద్యా శాఖాధికారి రాజేశ్వరి, హెచ్‌ఎం దత్తి సత్యన్నారాయణ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎడ్యుకేటర్ కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం, దివ్యాంగులకు ఎస్కార్ట్, రవాణా భత్యం, రీడర్ అలవెన్సు, స్టైఫండ్, ఉచిత ఉపకరణాలు అందిస్తుందన్నారు. స్కాలర్షిప్స్, ఫిజియోథెరపీ, పెన్షన్, పరీక్షలో రాయితీలు విద్యా, ఉద్యోగ రిజర్వేషన్స్ సౌకర్యాలను సక్రమంగా వాడుకొని తమ లోపాన్ని అధిగమించి అందరితో పాటు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవిత ఐఈఆర్పీలు సరిత, సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు రమేష్, రామారావు, తిరుపతి, శ్రీను, దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకుంటే జూలై 1 నుండి పనులు నిలిపివేత

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కొండలరావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఎన్నో ఏళ్లగా కేవలం సేవా దృక్పథంతో అనేక ఇబ్బందులు పడుతూ నెట్టుకొస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు నాలుగు నెలలుగా మెస్ బిల్లులు, గౌరవ వేతనాలు ఇవ్వటం లేదని దీనికి నిరసనగా జూలై లోగా బిల్లులు చెల్లించకుంటే పనులు నిలుపుదల

చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కొండలరావు, ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు కే.స్రవంతి అన్నారు. శుక్రవారం స్థానిక అమర్ భవన్‌లో మధ్యాహ్న భోజన పథక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండలరావు, కె.స్రవంతి మాట్లాడుతూ నాలుగు నెలలుగా మెస్ బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులంతా అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వీటికి సంబంధించిన బడ్జెట్ విడుదల చేయాలని అధికారులకు అనేకసార్లు తెలిపినప్పటికీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న ప్రభుత్వాలు మారుతున్న సమయంలో వేధింపులు తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన పథక కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఉంగరాల జయలక్ష్మి, కార్యదర్శి పి.లక్ష్మీ, రాజి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ వ్యర్థాలతో భూమి నాశనం

విశాలాంధ్ర - పూసపాటిరేగ: చోడవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 38/14లో ఉన్న రెండు ఎకరాల జిరాయితీ భూమిలో గుర్తు తెలియని వాహనం ద్వారా పరిశ్రమకు చెందిన హానికర వ్యర్థ జలాలను వదిలేసినట్లు మండలంలోని చోడమ్మ అగ్రహారం గ్రామానికి చెందిన అంబల్ల నారాయణమ్మ సిఐటియు నాయకులు బచ్చల సూర్య నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో రాధికకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీగా పంట నష్టం జరగడంతోపాటు టేకు, తాటి, కాము వంటి విలువైన చెట్లు పూర్తిగా నాశనమయ్యాయని, పక్కనే ఉన్న పిల్ల కాలువ ద్వారా వ్యర్థాలు చేరి ఆయకట్టు భూములకు ప్రమాదం ఏర్పడిందని ఆమె తెలిపారు. స్థానికులు డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిపినా, తగిన చర్యలు గానీ నష్టపరిహారం గానీ ఇప్పటి వరకు అందలేదని ఆమె వాపోయారు. పరిశ్రమ యాజమాన్యం, వాహన డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసి, తగిన న్యాయం చేయాలని, అలాగే భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుద్యోగ భృతి ఇస్తానని యువతను మోసగించిన కూటమి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్

విశాలాంధ్ర - బొబ్బిలి: కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ఏడాది పాలనలో నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్చిన హామీలపై నోరెత్తని కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్, జిల్లా యువజన సమాఖ్య అధ్యక్షుడు కోట అప్పన్నలు గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నెలకి రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిరుద్యోగ యువతకి ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారం చేజిక్కించుకున్నారన్నారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నిరుద్యోగ భృతి ఊసే ఎత్తని పరిస్థితి వుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 2025 ఫిబ్రవరి నెలలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ద్వారా నిర్వహించిన 'స్కిల్ సెన్సెక్స్ సర్వే' ప్రకారం 26 జిల్లాల్లో 2.67 కోట్ల మంది దగ్గర వివరాలను సేకరించగా ఉపాధి లేని వారి సంఖ్య కోటిన్నర పైనే ఉందని, రాష్ట్రంలో 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు వారిలో ఏ ఉపాధి లేనివారు ఒక కోటి 56 లక్షల మందిఉన్నారని ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయని అన్నారు. వీరిలో 52.69 లక్షల మంది ఏదో ఒక పని చేస్తున్నట్లు తెలపగా 52.74 లక్షల మంది ఏ పనైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలపడం గమనార్హం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖాలలో ఉద్యోగ ఖాళీగా ఉన్న అన్ని పోస్టులు భర్తీ చేసి అమరావతిని ఫ్రి జోన్‌గా ప్రకటించి 26 జిల్లాల నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వి.శ్రవణ్, ఏఐవైఎఫ్ డివిజన్ కమిటీ నాయకులు పి.చిన్న, ఆర్.శేఖర్, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జూలై 9న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయుసి రాష్ట్ర కార్యదర్శి , జిల్లా నిర్మాణ బాధ్యులు కొండలరావు అన్నారు. శుక్రవారం స్థానిక అమర్ భవన్‌లో ఏఐటీయుసి జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కొండలరావు మాట్లాడుతూ ప్రస్తుతం నరేంద్ర మోడీ ప్రభుత్వం 44 లేబర్ కోడ్‌లను నాలుగు చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కార్మికులపై వేధింపులు ఎక్కువయ్యాయిన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలైన బ్యాంకులు, ఇన్సూరెన్స్ ,రైల్వే, ఎయిర్లైన్స్ తదితర వాటిని పూర్తిగా ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమవడం అన్యాయం అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా అసంఘటిత కార్మికులకు ఇప్పటికీ న్యాయం జరగలేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ జూలై 9న జరిగే ఏఐటీయూసీ దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు, మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు కే స్రవంతి, ఏఐటీయూసీ నాయకులు అల్లి మారయ్య, పొడుగు రామకృష్ణ, మజ్జి ఆది బాబు, రాజి, ఉంగరాల జయలక్ష్మి, పి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు పార్టీని నడిపే అర్హత ఉందా..!

టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - చీపురుపల్లి: గ్రామంలో వార్డు సభ్యునిగా పోటీ చేయాలనుకునే వ్యక్తి కూడా తన నడవడికతో ప్రజలను ఆకట్టుకోవాలని చూస్తారని, మంచి చెడులను గ్రహించి, మంచి చేయాలనే అనుకుంటారని టీడీపీ జిల్లా అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీరు చాలా అధ్వానంగా ఉందని.. ఏ నాయకుడూ మాట్లాడని భాష, ఎవరూ సమర్థించని వైఖరిని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. శుక్రవారం చీపురుపల్లిలో నివాసంలో మీడియాతో నాగార్జున మాట్లాడారు. జగన్ పర్యటనలో ఒక సైకో యువకుడు రప్పా రప్పా అని పీకలను నరికేస్తామని ప్లకార్డులు ప్రదర్శిస్తే.. ఖండించాల్సింది పోయి, సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. "అసలు జగన్ కు ఒక పార్టీని నడిపే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. విశాఖలో ఈనెల 21న నిర్వహించే యోగా డేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - లక్కవరపుకోట: ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే యోగా సాధన తప్పనిసరి అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ శనివారం విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చరిత్రపటంలో నిలిపే విధంగా అందరూ విజయవంతం చేయాలని అని అన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరుగు మెగా యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తెర్లాం: యోగాంధ్ర విజయవంతానికి కృషి చేయాలని ఎంపీడీఓ ఆర్.రాంబాబు పిలుపునిచ్చారు. విశాఖలోనిర్వహించబోయే కార్యక్రమానికి తెర్లాం మండలం నుంచి రాత్రి 2:00 గంటల సమయంలో 242 మంది బయలుదేరుతున్నారని అన్నారు. తెర్లాం మండలం నుండి కుమ్మరి పేట గ్రామం కస్తూరి భాయ్ స్కూల్ నుండి 130 మంది విద్యార్థులు, పెరుమాలి ఆదర్శ పాఠశాల నుండి 55 మంది విద్యార్థులు, పెరుమాలి హైస్కూల్ నుండి 40 మంది విద్యార్థులు, తెర్లాం స్కూల్ నుండి 17 మంది విద్యార్థులు వీరు అందరు కూడా జీఎమ్మార్ సంస్థ బస్సుల ద్వారా యోగ కేంద్రం చేరుకోనున్నట్లు

చెప్పారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ నీలిమ, పెరుమాలి ఆయుర్వేద డాక్టర్ శ్రీనివాసరావు, ఎంఈఓ జె.త్రినాధరావు పాల్గొన్నారు.

విజయనగరం ఫోర్ట్: అంతర్జాతీయ యోగా దినోత్సవమును విజయవంతం చేయుటకు సన్నాహకంగా పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు యోగా కార్యక్రమం నిర్వహించడం

జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు పాల్గొన్నారు. యోగా కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో జరగనున్న వేడుకల్లో వేయాల్సిన ప్రోటోకాల్ యోగా ఆసనాలను వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, పట్టణంలో గల విజ్జీ స్టేడియం, రాజీవ్ స్టేడియం, ఎమ్.ఆర్. స్టేడియం, కోడి రామూర్తి జిమ్, బాక్సింగ్, వాలీ బాల్, తైక్వాండో, క్రికెట్, వాకర్స్ క్లబ్ ఇలా వివిధ వర్గాల వారు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర - డెంకాడ: మండలంలోని అక్కివరం మోపాడ గ్రామం పంచాయతీలలో శుక్రవారం వ్యవసాయ అధికారి టి.సంగీత అధ్యక్షతన ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర ఆధ్వర్యంలో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సంగీత మాట్లాడుతూ వరి విత్తనాలకు సంబంధించిన రైతు సేవ కేంద్రంలో మొలక శాతం కట్టగా 95% రావడం జరిగింది అని తెలిపారు. మండలానికి వేరుశనగ విత్తనాలు 14.7 క్వింటాలు రావడం జరిగిందని (30 కేజీల) బస్తా వేరుశనగ పూర్తి ఖరీదు 2780 సబ్సిడీ 1116 పోగ రైతు కట్టవలసింది 1674 రూపాయలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంది కిరణ్ వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా సదస్సు

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్: విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎస్.కోట మండల కమిటీ ఆధ్వర్యంలో 18వ అఖిలభారత మహాసభ సందర్భంగా విద్యా సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యారంగంలోని సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటాన్ని నొక్కి చెప్పడంతోపాటు, కేంద్ర ప్రభుత్వం యొక్క నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమాన్ని ఎస్.కోట వివేకానంద కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. రమేష్ జెండాను ఆవిష్కరించారు. తర్వాత నిర్వహించిన విద్యా సదస్సులో జిల్లా అధ్యక్షుడు డి. రాము ప్రధానంగా మాట్లాడుతూ, పేద విద్యార్థులను విద్యా వ్యవస్థ నుండి దూరం చేస్తోంది. విద్య దేశ అభివృద్ధికి ఉపకరించాలి, కానీ ప్రస్తుత విధానాలు వెనక్కి తీసుకువెళ్తున్నాయి అని హెచ్చరించారు. రాము మరోవైపు విజయనగరం జిల్లాలో ఎస్ఎఫ్ఐ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, సంక్షేమ హాస్టళ్లు, గజపతినగరం, చీపురుపల్లి వంటి ప్రాంతాలలో ప్రభుత్వ జూనియర్ %డ% డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయడంలో ఎస్ఎఫ్ఐ నాయకత్వం కీలక పాత్ర పోషించింది అని పేర్కొన్నారు. సదస్సులో

జిల్లా ఉపాధ్యక్షుడు వి. చిన్నబాబు, సహాయ కార్యదర్శి కె. రమేస్ మండల నాయకులు రవి, నాయుడు, రుతు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా విద్యారంగ సంస్కరణలపై ఎస్ఎఫ్ఐ తీవ్ర అభిప్రాయాలతో పాటు, విద్యార్థుల హక్కుల కోసం కొనసాగించే పోరాట హామీని విశదీకరించారు.

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: అంతర్జాతీయ యోగా దినోత్సవం,జూన్ 21న శనివారం పురస్కరించుకొని శ్రీ సాయికృష్ణ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న నడక మైదానంలో యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా క్లబ్ యోగా గురువు చక్రధర్ పట్నాయక్ యోగా యొక్క విశిష్టతను సభ్యులందరికి వివరిస్తూ ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రీస్తు పూర్వం రెండువందల సంవత్సరాల క్రితం పతంజలి రచించిన యోగ నేడు విశ్వజనీనమై ప్రపంచంలో సుమారు 180 దేశాలకు పైగా యోగ వినియోగప్రక్రియ వెలుగొందుతుందని,యోగ అనేది ఏ కులానికో, మతానికో చెందింది కాదని, యోగాతో చక్కని ఆరోగ్యాన్ని సాధించవచ్చునని, యోగాభ్యాసాలు నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని,శారీక, మానసిక ఆరోగ్యాన్ని సాధించేందుకు యోగా దోహదపడుతుందని చెప్పారుఅన్నారు. డిస్ట్రిక్ట్ 102 ఎలక్ట్ గవర్నర్ ఎ. తిరుపతి రావు,క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎస్ ప్రకాశరావు మాష్టారు మాట్లాడుతూ

మంచి ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా ధ్యానం, యోగాసనాలు వేయాలని, కరోనా సంక్షోభ కాలంలో యోగా ప్రముఖ్యతను ప్రపంచదేశాలు గుర్తించాయని, యోగాలో ప్రాణామాయ ప్రక్రియ మనిషిలో రోగనిరోధక కణాలను పెంచి, రక్తప్రసరణ బాగాజరిగి, ఊపిరితిత్తులు బలోపేతమై ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. అనంతరం క్లబ్ యోగ గురువు చక్రధర్ పట్నాయక్ క్లబ్ సభ్యులచే యోగాసనాలు వేసి, వేయించి ఆసనాలపై అవగాహన కల్పించారు. చివరగా యోగా గురువు చక్రధర్ పట్నాయక్ కు వాకర్స్ క్లబ్ పెద్దలంతా ఘనంగా సత్కరించారు.

అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా నిర్వహించిన యోగాంధ్ర వేడుకలు

విశాలాంధ్ర-గరివిడి : స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాల భాస్కరరావు అధ్యక్షతన యోగాంధ్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యోగా శిక్షకులు మరియు మాజీ మండల విద్యాశాఖ అధికారి జె.మహాలక్ష్మినాయుడు గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా సాధనతో ప్రశాంతమైన జీవనం లభిస్తుందని,దైనందిన జీవితంలో యోగా భాగం కావాలని తెలిపారు.అలాగే పలురుగ్మతల బారిన పడకుండా కాపాడుకునేందుకు యోగాసనాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి మరొక అతిథిగా బ్రహ్మకుమారీస్ హేమలత గారు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా సాధన ద్వారా మానసిక వికాసం,ఏకాగ్రత పెంచుకోవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జె.బాల భాస్కరరావు గారు మాట్లాడుతూ జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలన్నారు,యోగాసనాలు వేయడం ద్వారా ఒత్తిడితోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని జయించగలరన్నారు. మరియు ప్రతి ఒక్కరికి యోగా దివ్య ఔషధం లాంటిదని తెలిపారు.ఈ కార్యక్రమంలో 120 విద్యార్థులు పాల్గొని వివిధ రకాల యోగాసనాలు వేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్ కుమార్,వివిధ విభాగాధిపతులు,ఉపాధ్యాయులు,%చీూ% వాలంటీర్లు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-వేపాడ: మండలం లోని సోంపురం జిల్లా పరిషత్ హై స్కూల్లో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఉపాధ్యా యులకు బీఫ్ సభ ఏర్పాటు చేసి ఘనంగా

సన్మానించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివిఏ రాజు తెలిపారు.ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు శ్రీను,రవి శంకర్, గౌరీ, విజయ భవానిలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు సాదరంగా వీడ్కోలు పలికారు.అలాగే బదిలీ ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులందరికీ రూ.10వేల విలువైన విద్యా కిట్లను అందజేశారు.భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కలర్ పార్టీ స్వాగతంతో మొదలైన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎన్. నాగభూషణరావు,మండల విద్యా శాఖాధికారి - 2 పి. బాల భాస్కరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి జగన్నాథరావు,భారత్ స్కౌట్స్, గైడ్స్ ఇంచార్జి రమేష్ నాయుడు ,సన్యాసిరావు, నాయి మున్నీషా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్టాలు, పాఠశాల భద్రత రక్షణ ఇంచార్జి ఉపాధ్యాయులు ఎస్. గోవిందరావు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రెవిన్యూ డే సందర్భంగా వేడుక

విశాలాంధ్ర -గంట్యాడ: మండల కేంద్రమైన గంట్యాడ తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే సందర్భంగా సంబం ధిత కార్యక్రమాలు అద్భుతంగా

జరిగాయి. ముఖ్యంగా రెవెన్యూ వ్యవస్థలో మండలానికి సంబంధించి తాసిల్దారు యొక్క పాత్ర ఎంతో ముఖ్యమైనదని కారణం ఏమిటంటే సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజాహితం కొరకు రేయంబవళ్ళు పనిచేయవలసి ఉంటుంది. తహసిల్దార్ తో కలిపి రెవెన్యూ ఉద్యోగులందరూ అంకితభావంతో బృంద స్ఫూర్తితో పనిచేయవలసిన గురుతర బాధ్యత ఉన్నదని ఈ సందర్భంగా మాట్లాడుతూ తహసిల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రంగోలి చిత్రాలను కూడా గీశారు కార్యాలయానికి వచ్చిన ప్రజలను విశేషంగా ఆకర్షించుట ముఖ్య విషయంగా కనిపించింది. రంగోలి చిత్రాన్ని డి టి .కె నాగలక్ష్మి గీశారు.

యోగా వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ...

నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం: యోగా వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని విజయ నగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025

కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం కోట వద్ద యోగాసనాలు వేసే కార్యక్రమం జరిగింది. యోగ శిక్షకులు అందరిచేత యోగాసనాలు వేసే విధానాలను తెలియపరిచారు. అనంతరం ర్యాలీని చేపట్టి యోగాంధ్ర విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ యోగాంధ్ర 2025 వల్ల ప్రజలందరికీ యోగా యొక్క ప్రాధాన్యత తెలియజేసే వీలుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగ పట్ల చైతన్యవంతులై ప్రతిరోజు యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఓ సింహాచలం, ఆయుష్ అధికారి ఆనందరావు,నగరపాలక సంస్థ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు అందజేయాఌ

విశాలాంధ్ర-బాడంగి : ఎరువులు పురుగుమందులు కొనుగోలు చేసిన రైతులకు సంబంధించిన బిల్లును అందజేయాలని వ్యవసాయ అధికారి సూర్యప్రకాష్ అన్నారు. బాడంగి మండల వ్యవసాయధికారి గొర్ల సూర్య ప్రకాష్ మండలం లో గల ఎరువులు -విత్తనాలు -పురుగుమందులు షాప్స్ డీలర్లు తో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరైతులు కి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మేటప్పుడు తప్పనిసరిగా బిల్ అందజేయాలనీ డీలర్లు కి సూచించారు.విత్తనాలు డీలర్లు తప్పనిసరిగా విత్తనాలు స్టాక్ వచ్చినవెంటనే లాట్ లు ఆధారంగా వాటికీ మొలక శాతం పరీక్షలు నిర్వహించి అనంతరం రైతులు కి అమ్మాలి అని సూచించారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు,అమ్మకాలు వివరాలు,వాటి ధరలు వివరాలు బయట డిస్ప్లే బోర్డు లలో నమోదు చేసి పొందుపరచాలి అని తెలిపారు. కార్యక్రమం సునీత, శరత్, జయలక్ష్మి, సాయికుమార్, డీలర్లు పాల్గొన్నారు..

బ్యాంకులలో బీమాతో ఖాతాదారులకు ధీమా..

విశాఖ రీజినల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్‌లు

విశాలాంధ్ర-వేపాడ: బ్యాంకు ఖాతాదారులు ఇన్సూరెన్స్ బీమా చేసుకోవడంతో కుటుంబానికి ధీమా ఉంటుందని ఏపీజీబీ విశాఖ రీజనల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్ అన్నారు.వల్లంపూడి గ్రామ సచివాలయంలో శుక్రవారం సాయంత్రం వేపాడ బ్రాంచ్ మేనేజర్ సునీత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గ్రామానికి చెందిన తమనాన వెంకటరావు గత ఏడాది జూన్లో ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోవడంతో ఎస్బిఐ లైఫ్ జీవిఐ పథకంలో రూ.20 లక్షల చెక్కును మృతుడు భార్య ఇందుకు ఆర్.ఎం చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.ఖాతాదారులకు ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదానికి జీవిఐ తోపాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో చేరాలని సాధారణ మరణంకు పి.ఎం జే.జే.బి.వై.ఇన్సూరెన్స్ తీసుకుని కుటుంబానికి భరోసా కల్పించాలన్నారు. గ్రామీణ బ్యాంకులో వ్యవసాయ రుణంతో పాటు బంగారు రుణం మహిళా రుణాలు తదితర పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వల్లంపుడిలో వెంకట్రావు భీమా పొందడం వలన కుటుంబానికి రూ

20లక్షలు చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ప్రతి ఖాతాదారుడు ఇన్సూరెన్స్ పాలసీ విధిగా తీసుకొని కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ చీఫ్ మేనేజర్ శుక్ల, ఎఫ్ఐసి స్వాప్న, ఛానల్ మేనేజర్లు మాధవరావు, భాను చంద్ర నాయుడు, ఏపీజీబీ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్ కుమార్ క్యాషియర్ చంద్రబాబు నాయుడు మహేష్ సి ఎస్ పి లు ఈశ్వరరావు శారద బంగారమ్మ త్రినాధమ్మ సత్యనారాయణ దేవి పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-రామభద్రపురం: ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కారుణ్య ఫౌండేషన్ నిర్వాహకుడు జెసి రాజు అన్నారు. శుక్రవారం నాయుడు వలస గ్రామంలో పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులతో యోగ ట్రైల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు అని ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారము ఉదయం 6:30 నుంచి 7:30 గంటల వరకు ప్రతి ఒక్కరూ నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఈ కార్యక్రమంలో పాల్గొనలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల కృష్ణ నాయుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమానికి జేఎన్టీయూ జీవీ విద్యార్థులు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ - గురజాడ , అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలలు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం 6:00 గంటలకు నిర్వహించబడుతున్న "యోగాంధ్ర 2025" కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటాయి. ఈ కార్యక్రమం విశాఖపట్నం బీచ్ రోడ్ నుండి ప్రారంభమై భీమునిపట్నం బీచ్ వరకు కొనసాగుతుంది. విశాఖపట్నం, అనకాపల్లి , జిల్లాల్లో విస్తరించి ఉన్న జే ఎన్ టి యు జి వి కు అనుబంధంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల నుండి గణనీయమైన సంఖ్యలో విద్యార్థులు ఈ గొప్ప కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 9,612 మంది విద్యార్థులు యోగాభ్యాసంలో పాల్గొంటారు. సజావుగా రవాణా చేయడానికి, 180 బస్సులు ఏర్పాటు చేయబడ్డాయి. అదనంగా, విద్యార్థులు మరియు వారి సంబంధిత సంస్థల విభజనను నిర్వహించడానికి 15 కంపార్ట్‌మెంట్‌లను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేశారు.బావికొండ, భీమునిపట్నం, నేరెళ్లవలస, మరియు తిమ్మాపురం అనే నిర్ణీత ప్రదేశాలలో పార్కింగ్ మరియు వేదిక ఏర్పాటుతో సహా అన్ని లాజిస్టికల్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమం విద్యార్థులలో ఆరోగ్య అవగాహనను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించడానికి ఉద్దేశించబడింది. యోగా ద్వారా మానసిక ప్రశాంతత మరియు శారీరక దృఢత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో దీనిని రూపొందించారు. ఈ వివరాలను జేఎన్టీయూ జీవీ రిజిస్ట్రార్ మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవం - యోగాంధ్ర 2025 నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి. జయసుమ పంచుకున్నారు.



యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు

విశాలాంధ్ర -చీపురుపల్లి: యోగాంధ్ర -2025" మహోత్సవాల్లో భాగంగా ప్రజల్లో యోగపై అవగాహన పెంచేందుకు ఈ రోజు ఉదయం తన స్వగృహంలో చీపురుపల్లి శాసనసభ్యుడు మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకట్రావు యోగాసనాలు వేశారు. శనివారం విశాఖ లో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమిడి యోగాసనాలు వేశారు. ప్రజల్లో యోగా పై అవగాహన పెంచేందుకు యోగాసనాలు వేసి ప్రజలకు అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం ఉదయం తన స్వగృహంలో యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కళావెంకటరావు మాట్లాడుతూ "యోగ" చేయడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుంది.యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగువరుస్తుంది అని తెలిపారు. అంతేకాకుండా, దినసరి ఒత్తిడిని తగ్గించడంలో యోగా చాలా ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

మంత్రిలోకేష్ ని కలిసిన కిమిడి రామ మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నంలో జూన్ 21వ తేదీన నిర్వహించబోతున్న యోగాంధ్ర కార్యక్రమానికి హాజరయ్యేందుకు విశాఖ నగరానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కి విశాఖపట్నం విమానాశ్రయం వద్ద తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆయనతో చర్చించారు.

నిబంధనలకు తిలోదకాలిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు

- కాసులు వేటలో వేసవి సెలవుల్లోనూ ప్రత్యేక తరగతుల
- యోగ డే సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినా తెరుచుకున్న పాఠశాలలు
- ఇదీ మండలంలో ప్రైవేటు పాఠశాలల నిర్వహణ తీరు

విశాలాంధ్ర -మెరకముడిదాం: మండలంలో ఉన్న ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు నిబంధనలకు తిలోదకాలిస్తూ ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజుల్లో, ప్రత్యేక తరగతుల ముసుగులో, కాసుల వేటలో పడి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తెరిచి తరగతులు నిర్వహిస్తున్నారు. వివరాల్లోనికి వెళ్ళగా 20, 21 తేదీల్లో యోగ డే సందర్భంగా ప్రైవేటు పాఠశాలలకు విజయనగరం జిల్లా కలెక్టర్ వారు సెలవు ప్రకటించారు. కలెక్టర్ ఆదేశాలు ప్రాప్తికి మండల విద్యాశాఖ అధికారి ఎం. చంద్రశేఖర్ 19వ తేదీ రాత్రి మండలంలో ఉన్న అన్ని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల వాట్స్అప్ నెంబర్లకు వ్యక్తిగతంగా పాఠశాలలు తెరవద్దని ఆదేశించారు. అయినా మండల విద్యాశాఖ అధికారి మాట పెడచెవిని పెట్టి, తామేదో మండల విద్యాశాఖ గొడుగు కింద లేనట్లు, తమకేదో స్వయం ప్రతిపత్తి ఉన్నట్లు గతంలో మాదిరే గర్భాం, బైరిపురం లో ఉన్న ప్రైవేటు పాఠశాలలు తెరిచారు. గతంలో కూడా పబ్లిక్ హాలిడేస్ లోనూ, ప్రభుత్వం ప్రకటించిన సెలవుల్లోనూ, వేసవి సెలవుల్లోనూ ప్రత్యేక తరగతుల ముసుగులో ప్రైవేట్ పాఠశాలలను తెరిచారు. పలుమార్లు మండల విద్యాశాఖ అధికారి ఎం చంద్రశేఖర్ వారించినా వినకుండా పాఠశాలలో ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాల వారైతే అనుమతులు పొందినది ఒక దగ్గర అయితే, వేరే దగ్గర పాఠశాల నిర్వహిస్తూ, షిఫ్టింగ్ లెటర్స్ మండల, జిల్లా విద్యాశాఖ అధికారులకు సమర్పించకుండానే నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నడుపుతున్నారు. ఇటువంటి పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవలసినదిగా విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మండల విద్యాశాఖ అధికారి ఎం చంద్రశేఖర్ వివరణ

ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాల్లో తరగతులు నిర్వహించవద్దని పలుమార్లు అన్ని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలకు చెప్పడం జరిగింది. యోగ డే సందర్భంగా ప్రైవేటు పాఠశాలలు తెరవద్దని 19వ తేదీ రాత్రి గ్రూపులో మరియు

వ్యక్తిగతంగా ఆయా పాఠశాల యాజమాన్యాలకి సందేశాన్ని పంపించాం. ఇకనుండి సెలవు రోజుల్లో పాఠశాల నిర్వహిస్తే ఆయా పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

మాజీ సైనికుల యోగాంధ్ర

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయము, విజయ నగరం ఆధ్వర్యంలో మాజీ సైనికులచే యోగాంధ్ర కార్యక్రమము స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ లో నిర్వహించారు సుమారు 30 మంది పాల్గొన్న ఈ ప్రోగ్రామ్ లో యోగా గురువు శివ సుందర రావు, రాజేశ్వర రావు మరియు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న జరిగే నిరసన లో యువత మొత్తం పాల్గొనండి

వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు అవినాష్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ సూచనలతో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం, నిరుద్యోగ భృతి ఇస్తాం అని సంవత్సర కాలంగా మోసం చేస్తున్నందుకు ఈ నెల 23వ తేదీన సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థి యువత పాల్గొనాలని వైసిపి యువజన, విద్యార్థి విభాగం అధ్యక్షులు అల్లు అవినాష్, కరుమజ్జి సాయికుమార్ అన్నారు. దీనికి సంబంధించి శుక్రవారం మజ్జి సిరిసహస్ర(సిరిమ్మ) చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగాయువజన విభాగ అధ్యక్షులు అల్లు అవినాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంగా నిరుద్యోగ యువతకు ప్రతి నెల రూ.3వేలు నిరుద్యోగ భృతి ఎన్నికల హామీ నెరవేర్చకుండా రాష్ట్ర లో సుమారు 1.60 కోట్ల కుటుంబాలను మోసం చేసిందన్నారు, వాలంటీర్ లకు 10వేలు జీతం ఇస్తామని చేపి విధుల నుండి తొలగించారన్నారు .ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి విడుదల చేయకుండా ఈ రాష్ట్రం లోని యువతను మోసం చేసిన ఘనత ఈ కూటమి ప్రభుత్వంకే దక్కిందన్నారు. ఈ కూటమి ప్రభుత్వం పై నిరసన తెలియజేయుటకు జిల్లాలో గల యువత పెద్ద ఎత్తున 23వ న తరలి రావాలని పిలుపు ఇచ్చారు.ఈకార్యక్రమంలో తోట వాసు, తరుణ్, శివ, జగదీష్, పృథ్వీ పాల్గొన్నారు.

ఇంగిలాపల్లి గ్రామంలో స్కూల్ బ్యాగ్లు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-దత్తిరాజేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా విద్యార్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాలతో ఇంగిలాపల్లి గ్రామం యూ పి స్కూల్ లో టిడిపి నాయకులు గాడి కృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు మన్యాల ఎరుకునాయుడు విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లు మరియు పాఠ్య పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నడుపూరు సూర్యనారాయణ, డొప్ప రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు